PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 336 పేజీలు - 08 శుక్రవారం 30 అక్టోబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

కరువులో మూసీ సుందరీకరణ ఎందుకు?

● రూ.1.50 లక్షల కోట్లను రైతులు, ప్రజల కోసం ఖర్చు చేయాలి ● డీపీఆర్ లేకుండానే భారీ ప్రాజెక్టు చేపడుతున్నారంటూ కేటీఆర్ విమర్శలు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 365 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. మిగతా2లో...

తెలంగాణలో పెట్టుబడులకు భరోసా నాదే!

- ప్రతి రూపాయికీ భద్రత కల్పిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- పెట్టుబడులను రెట్టింపు చేయండి.. పూర్తి సహకారం అందిస్తాం

2లో

'కొండా' యూటర్న్.. బీఆర్ఎస్‌లోకి వెళ్తారా?

- కేటీఆర్‌పై గత వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న కొండా సురేఖ

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29: మాజీ మంత్రి కొండా సురేఖ రాజకీయ వైఖరి మరోసారి చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటూ ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. తన వ్యాఖ్యల వల్ల కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు బాధపడి ఉంటే చింతిస్తున్నట్లు పేర్కొన్నారు.గతంలో కేటీఆర్‌పై కొండా మిగతా2లో...

నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ

స్పష్టం చేసిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని వెల్లడి

2లో

100 శాతం ఇథనాల్ వాహనాలకు ఇంధనం ఎలా?

● కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు ● రైతుల ప్రయోజనాలు, పర్యావరణంపై దృష్టి పెట్టాలని సూచన

2లో

తెలంగాణ విజయగాథలో భాగస్వాములవుతాం

● తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం ● 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలి ● పెట్టుబడులకు అపార అవకాశాలు.. అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వామ్యం: పీయూష్ గోయల్

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగతా2లో...

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం!

బీజేపీకి కంచుకోటగా భావించే ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ విజయాలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు

2లో

మియాపూర్ భూములు ప్రభుత్వానివే!

● 550 ఎకరాలపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29: హైదరాబాద్ లోని మియాపూర్ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో విజయం లభించింది. సుమారు 550 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు తమవేనంటూ ప్రైవేటు వ్యక్తు లు దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న భూ వివాదానికి ముగింపు పలికినట్లయింది.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న భూములపై ఈ వివాదం కొనసాగుతోంది. గతంలో ప్రత్యేక న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వగా, 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మిగతా2లో...

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

- నవంబర్ 26 వరకు క్లెయిములు, అభ్యంతరాలకు అవకాశం
- నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల



2లో

'సర్'పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహం

- నితీన్ నబీన్ ఆధ్వర్యంలో కీలక సమావేశాలు

2లో

డిజిటల్ మోసాల్లో బ్యాంకులదే బాధ్యత

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు

2లో

100 శాతం ఇథనాల్ వాహనాలకు ఇంధనం ఎలా?

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29:100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇస్తే, వాటికి అవసరమైన ఇంధనాన్ని ఎలా సరఫరా చేస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి వాహనాలకు పెద్ద మొత్తంలో ఇథనాల్ అవసరమవుతుందని, అందుకు తగిన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థను ఎలా ఏర్పాటు చేస్తారో వివరించాలని సూచించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం ఇథనాల్ కేటాయింపులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ప్రశ్నలు లేవనెత్తింది. వాహనాలు పూర్తిస్థాయిలో ఇథనాల్‌తో నడిచేందుకు అనుమతించినట్లు వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ, అవసరమైన ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై స్పష్టత కోరింది. దీనిపై స్పందించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, ఇలాంటి మార్పులకు భారీ స్థాయిలో తయారీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సి ఉంటుందని తెలిపారు.**రైతుల ప్రయోజనాలకూ ప్రాధాన్యం** ఇథనాల్ విధానాన్ని పరిశీలించేటప్పుడు పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య ప్రజలకు ప్రయోజనం కలిగేలా విధానాలు ఉండాలని పేర్కొంది. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే అంశానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. మరోవైపు, కేంద్ర రహదారి రవాణా మంత్రిత్వ శాఖ అక్టోబర్ 26న వాహన నిబంధనల్లో సవరణలు చేసింది. ఈ మార్పులతో అధిక ఇథనాల్ మిశ్రమాలతో పాటు దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్‌తో నడిచే వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ నిబంధనల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే, పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే శాతాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే తక్షణ ప్రణాళిక లేదని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి అక్టోబర్ 27న వెల్లడించారు.ఇథనాల్ సరఫరా సంవత్సరం 202526కు సంబంధించి కేటాయింపులపై కొనసాగుతున్న కేసులో సుప్రీంకోర్టు తదుపరి విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది. ఇథనాల్ వినియోగాన్ని ప్రోత్సహించే విధానాల్లో సరఫరా సామర్థ్యం, రైతుల ఆదాయం, పర్యావరణ ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ విచారణ మరోసారి ముందుకు తెచ్చింది.

తెలంగాణలో పెట్టుబడులకు భరోసా నాదే!

ప్రతి రూపాయికీ భద్రత కల్పిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

పెట్టుబడులను రెట్టింపు చేయండి.. పూర్తి సహకారం అందిస్తాం

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29:తెలంగాణలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడికీ పూర్తి భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి పెట్టుబడులకు తానే సంరక్షకుడిగా వ్యవహరిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వ్యాపార విస్తరణకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని, పెట్టుబడులు, వ్యాపార వృద్ధి, లాభాల అంచనాలను రెట్టింపు చేసుకోవాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' సన్నాహక కార్యక్రమం గురువారం ఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పెట్టుబడిదారుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకొని వాటిని ప్రభుత్వ విధానాల్లో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకులను తొలగించడం, అవసరమైన విధానపరమైన సహకారం అందించడం తన బాధ్యతని పేర్కొన్నారు. **ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ**హైదరాబాద్ ఇకపై ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాలతో మాత్రమే కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 'తెలంగాణ రైజింగ్2047' లక్ష్యంలో భాగంగా 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుత ఐదు శాతం నుంచి పది శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. **అభివృద్ధికి కేంద్రం సహకారం**కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పనిచేస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెకు మూడు హైస్పీడ్ రైలు మార్గాల ఏర్పాటు, వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు కేంద్రం సహకరిస్తోందని వివరించారు. ప్రాంతీయ వలయ రహదారి, మెట్రో రైలు విస్తరణ, నేవీ రాడార్ కేంద్రం వంటి అభివృద్ధి కార్యక్రమాలనూ ప్రస్తావించారు.రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు దేశ అభివృద్ధికి పునాది వేశాయని సీఎం పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి తమ వంతు సహకారం అందించాయని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

కరువులో మూసీ సుందరీకరణ ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

కరువు సమయంలో ఈ ప్రాజెక్టును వాయిదా వేసి, ప్రతిపాదిత రూ.1.50 లక్షల కోట్లను రైతులు, ప్రజల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు.గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోతుంటే మూసీ సుందరీకరణ అవసరమేంటని ప్రశ్నించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండానే భారీ ప్రాజెక్టు చేపడుతున్నారని ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి గోదావరి, కృష్ణా నదుల నీటిని సమర్థంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. మల్లన్నసాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని మూసీలోకి తీసుకురావాలనే ప్రతిపాదనపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంతో పాటు విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌పై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాస్తవంగా వచ్చిన పెట్టుబడులు, కల్పించిన ఉద్యోగాల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలకు విద్యుత్, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం!

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29:బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఎన్ని స్థానాలు గెలిచామన్నది మాత్రమే కాకుండా, ఎక్కడ విజయం సాధించామన్నది కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. బీజేపీకి బలమైన ప్రాంతాలుగా భావించే చోట్ల కూడా ప్రతిపక్ష పార్టీలు విజయాలు సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు.బీజేపీకి కంచుకోటగా భావించే నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ విజయం సాధించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు గెలిచారని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రస్తావించారు. ఈ ఫలితాలు ప్రజల రాజకీయ అభిప్రాయాల్లో మార్పును సూచిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలపై బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్యానించారు.**నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ** ఢిల్లీలో నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి నిరసన ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తాయని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు తమ నిరసనను తెలియజేయనున్నాయని పేర్కొన్నారు.ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్లను నిరాకరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నిరసనను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లి ర్యాలీలో పాల్గొంటారని స్పష్టం చేశారు.బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును భారత ఎన్నికల సంఘం పొడిగించింది. క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 26 వరకు అవకాశం కల్పించింది. ఈ రెండు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాలను నవంబర్ 30న ప్రచురించనున్నట్లు ప్రకటించింది.ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ప్రజలకు మరింత సమయం ఇవ్వాలన్న అభ్యర్థనల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. గడువు పొడిగించాలంటూ బుధవారం సుప్రీంకోర్టు చేసిన సూచనల తర్వాతి రోజే ఈసీ సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఓటర్ల జాబితాల్లో పేర్ల నమోదు, వివరాల సవరణ, అభ్యంతరాల పరిష్కారానికి ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. **ఇతర రాష్ట్రాల్లోనూ గడువు పెంపు**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, హరియాణా, నాగాలాండ్, ఢిల్లీలోనూ ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మహారాష్ట్రలో క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 13 వరకు గడువు ఇచ్చారు. అక్కడ నోటీసులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ నవంబర్ 25 వరకు కొనసాగుతుంది. తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న విడుదల చేయనున్నారు.ఢిల్లీలో క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 25 వరకు అవకాశం కల్పించారు. అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ డిసెంబర్ 15 వరకు కొనసాగనుండగా, తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నారు.ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను సరిచూసుకొని, అవసరమైన మార్పుల కోసం నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అధికారులు సూచిస్తున్నారు.

నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29:నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై బాధ్యత వహించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిరసనకు అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా ఉన్నాయని ఖర్గే తెలిపారు.ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నవంబర్ 1న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ ప్రజలకు పిలుపునిచ్చింది.

మియాపూర్ భూములు ప్రభుత్వానివే!

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఆ నిర్ణయాన్ని సమర్థించింది. ఈ తీర్పులను సవాలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.దాదాపు 23 ఏళ్లుగా కొనసాగిన న్యాయపోరాటంలో తాజాగా సుప్రీంకోర్టు అప్పీళ్లను కొట్టివేయడంతో ప్రభుత్వ భూముల హక్కులపై స్పష్టత వచ్చింది. విలువైన భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఈ తీర్పు కీలకంగా మారింది.

'సర్'పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహం

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29: ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహరచన చేసింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ గురువారం ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యదర్శులతో పాటు కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించారు. సర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి సమర్థంగా ఎదుర్కోవాలని చర్చించినట్లు సమాచారం.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీ నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. సర్ ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు, పార్టీ చేపట్టిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపైనా సమావేశాల్లో చర్చించారు.

డిజిటల్ మోసాల్లో బ్యాంకులదే బాధ్యత

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 29:డిజిటల్ అరెస్టు, సైబర్ మోసాల వల్ల ఖాతాదారులు నష్టపోతే, బ్యాంకులు తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించనట్లు తేలిన సందర్భాల్లో బాధితులకు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనుమానాస్పద లావాదేవీలను ముందుగానే గుర్తించి, నగదు బదిలీని నిలిపివేసే చర్యలు చేపట్టాలని సూచించింది.ఖాతాదారుల సాధారణ లావాదేవీలకు భిన్నంగా భారీ మొత్తాలు బదిలీ అవుతున్నప్పుడు బ్యాంకులు అప్రమత్తం కావాలని ధర్మాసనం పేర్కొంది. అవసరమైతే కృత్రిమ మేధ సాయంతో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని సూచించింది. సైబర్ మోసాల నియంత్రణకు రిజర్వు బ్యాంకు రూపొందిస్తున్న నిబంధనలను కూడా పరిశీలించనున్నట్లు తెలిపింది.

'కొండా' యూటర్న్.. బీఆర్ఎస్‌లోకి వెళ్తారా?

(మొదటి పేజీ తరువాయి)

సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీశాయి. ప్రస్తుతం ఆమె మంత్రివర్గం నుంచి తొలగించబడిన నేపథ్యంలో, తాజాగా చేసిన ప్రకటన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిణామంతో కొండా దంపతులు బీఆర్ఎస్‌లో చేరుతారనే ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలోనూ పార్టీ మార్పుపై ప్రచారం జరిగినప్పటికీ, దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. కేటీఆర్‌పై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడం రాజకీయ సయోధ్యకు సంకేతమా? లేక వ్యక్తిగతంగా చేసిన ప్రకటన మాత్రమేనా? అనేది స్పష్టత రావాల్సి ఉంది. కొండా సురేఖ తదుపరి రాజకీయ అడుగులపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆసక్తి నెలకొంది.

తెలంగాణ విజయగాథలో

భాగస్వాములవుతాం

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తే మరిన్ని పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.తెలంగాణలో ఔషధ, రక్షణ, అంతరిక్ష, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి, కృత్రిమ మేధ వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తాండూరు కందిపప్పు, నిజామాబాద్ పసుపు వంటి ప్రత్యేక గుర్తింపు కలిగిన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేయాలని సూచించారు. వీటి ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా రైతులకు, స్థానిక పరిశ్రమలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు వంటి కీలక ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక రంగ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఎగుమతిదారులకు కలిగే అవకాశాలను పరిశ్రమలు వినియోగించుకునేలా జిల్లాల స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. రాష్ట్రం నిర్దేశించుకున్న దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 29: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు అంకితభావంతో కృషి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కోరారు.పాలకుర్తి నియోజకవర్గం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొర్రూరు కాంగ్రెస్ పట్టణ కమిటీని ప్రకటించారు.నూతన కమిటీ ప్రతినిధులను ఎమ్మెల్యే సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు.వందేళ్ల చరిత్ర గలిగిన కాంగ్రెస్ పార్టీలో బడుగు, బలహీన వర్గాలకే అధిక ప్రాధాన్యం ఉందన్నారు.ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారని తెలిపారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకం అందుతుందని, ప్రతి గడపగడపకు మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా కార్యకర్తలు,నాయకులు కృషి చేయాలన్నారు.అనంతరం పట్టణ కమిటీని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ముద్దసాని సురేష్, మహిళ అధ్యక్షురాలుగా వెలుగు మహేశ్వరి, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మంగళపల్లి స్వామి,ఎస్టీ సెల్ అధ్యక్షులుగా ధరావత్ దేవేందర్,బీసీ సెల్ అధ్యక్షులుగా భూసాని రాము, కిసాన్ సెల్ అధ్యక్షులుగా గుర్రాల మహేందర్, పట్టణ ఉపాధ్యక్షులుగా కర్ర అశోక్ రెడ్డి, తూర్పాటి రాంబాబు,అనిత, పట్టణ ప్రధాన కార్యదర్శిగా తాళ్ల పెల్లి రమేష్ గౌడ్,మంగళపల్లి సోమయ్య,చింతాల సందీప్, కార్యదర్శిగా గుమ్మడవెల్లి శ్రీను, యశోద, జాటోత్ బీకు, కందుకూరి హరిప్రసాద్, నడిగడ్డ మధు,పోరెడ్డి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పేర్ల రాములమ్మ,రెడ్డబోయిన రవి, తాటికాయల రాణి,సిరికొండ భవాని,అలువాల శ్రీకాంత్, జలగం రమేష్,గూడెల్లి రేణుక, జాటోత్ శ్రీను లను నియమించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, కౌన్సిలర్లు ముద్దసాని సురేష్,జాటోత్ భద్రు నాయక్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరు రవీంద్ర చారి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా రమేష్ గౌడ్

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 29: కాంగ్రెస్ పార్టీ తొర్రూరు పట్టణ ప్రధాన కార్యదర్శిగా పట్టణ కేంద్రానికి చెందిన తాళ్లపెల్లి రమేష్ గౌడ్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి అప్పగించిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాసేవలో భాస్కర్ అన్నకు ప్రత్యేక గుర్తింపు!

- విద్య, వైద్యం, సాగునీటి రంగాల్లో సేవా కార్యక్రమాలు

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 29: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఈఎల్వీ భాస్కర్ అన్న ప్రజాసేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన అభిమానులు తెలిపారు. ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం, పేదలకు వైద్య సహాయం అందిస్తూ యువతలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు.రాజకీయాల్లోకి రాకముందే ప్రజలకు చేరువవుతున్న భాస్కర్ అన్నపై ప్రతికూల ప్రచారం జరుగుతోందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, ప్రజాసేవే తమకు ప్రధానమని తెలిపారు. ప్రజల ఆదరణతో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించారు.

అమరుల స్మరణలో.. ప్రాణదాతలై నిలిచి...

తొర్రూరులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో

మెగా రక్తదాన శిబిరం

ప్రజాప్రతినిధులు, యువత, పోలీసుల

స్వచ్ఛంద భాగస్వామ్యం

ముఖ్య అతిథిగా హాజరై ప్రోత్సహించిన

జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

మొత్తం 130 యూనిట్ల రక్తం సేకరణ

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 29: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగస్ఫూర్తితో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని లయన్స్ క్లబ్ వేదికగా తొర్రూరు సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, సమాజ రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ఎప్పటికీ మరవలేమని అన్నారు. అమరవీరుల సంస్మరణను పురస్కరించుకుని ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు."రక్తదానం అత్యంత గొప్ప మానవతా సేవ. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదాతలు నిజమైన ప్రాణదాతలుగా నిలుస్తారు. ఆరోగ్య అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలి" అని ఆయన సూచించారు. ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, పౌరులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 130 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి విశేష సహకారం అందించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (వరంగల్), లయన్స్ క్లబ్ (తొర్రూరు), అమ్మ హాస్పిటల్ (తొర్రూరు) ప్రతినిధులతో పాటు, శిబిరాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన తొర్రూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్, సీఐలు గణేష్, పవన్, ఎస్సైలు మహేందర్ రెడ్డి, ఖాదర్ బాషా ప్రమోద్ కుమార్, సతీష్‌లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గొర్రెలు, మేకలకు నీటి తొట్లు ఏర్పాటు చేయాలి

- పాత తొట్లకు మరమ్మతులు చేపట్టాలి
- జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు డిమాండ్

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 29:ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గొర్రెలు, మేకలకు తాగునీటి కొరత లేకుండా ప్రతి గ్రామంలో కొత్త నీటి తొట్లు ఏర్పాటు చేయాలని, పాడైపోయిన పాత తొట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జీఎంపీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం చౌటుప్పల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకమే జీవనాధారంగా ఉన్న గొల్ల, కురుమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. నీటి తొట్ల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించి పశువులకు నిరంతర తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.బండారు నర్సింహ, దయ్యాల నర్సింహ, కొండె శ్రీశైలం, గునమోని అయిలయ్య, బీమగోని బాలరాజు, పాక జహంగీర్, గాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలులో మాలలకు న్యాయం చేయాలి

- మాల మహానాడు జిల్లా అధ్యక్షులు రాకేష్ ఎనమాల

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 29: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులో భాగంగా గ్రూప్3 ఉద్యోగ నియామకాల రోస్టర్ విధానంలో మాలలకు న్యాయం చేయాలని మాల మహానాడు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రాకేష్ ఎనమాల డిమాండ్ చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శులు దాసరి ప్రకాష్, గుర్రాల లింగయ్య తో కలిసి రాకేష్ ఎనమాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాల, మాల ఉపకులాల జనాభాపై సమగ్ర సర్వే నిర్వహించి, వాస్తవ గణాంకాల ఆధారంగా రిజర్వేషన్ల అమలులో న్యాయమైన వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలులో భాగంగా గ్రూప్3 ఉద్యోగ నియామకాలకు సంబంధించి రూపొందించిన రోస్టర్ విధానాన్ని, జీవో నంబర్ 99లోని నిబంధనలను పునఃపరిశీలించి, మాల సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో పాటు మాల సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై స్పందించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, మాల, మాల ఉపకులాలకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.మాల సామాజిక వర్గం నుంచి వివిధ పదవుల్లో కొనసాగుతున్న ప్రజాప్రతినిధులు తమ సామాజిక వర్గ హక్కుల పరిరక్షణకు ముందుకు రావాలని రాకేష్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే పదవులకు రాజీనామా చేసి హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే స్పందించి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు గోడిశాల సంజీవ రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండాల బిక్షం, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పుల శ్రీనివాస్, డివిజన్ నాయకులు మహేష్, లక్ష్మీ ప్రసన్నకుమార్, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు రాజకీయాల్లో చలమల్ల కృష్ణారెడ్డి పేరు.. కొత్త చర్చ!

- కార్పొరేషన్ పదవిపై ప్రచారం.. కొత్త చౌటుప్పల్ నియోజకవర్గంపై ఊహాగానాలు

తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 29: మునుగోడు కాంగ్రెస్ రాజకీయాల్లో చలమల్ల కృష్ణారెడ్డి పేరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆయనకు కార్పొరేషన్ పదవి దక్కనుందనే ప్రచారం స్థానికంగా ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారంటూ అనుచరుల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై అధికారిక ధ్రువీకరణ లేదు.భవిష్యత్తులో కొత్త చౌటుప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడితే ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తారా? మునుగోడు రాజకీయ సమీకరణాల్లో ఆయనకు కీలక బాధ్యతలు దక్కుతాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అయితే కార్పొరేషన్ పదవి, కొత్త నియోజకవర్గం, అభ్యర్థిత్వంపై ప్రస్తుతానికి స్పష్టమైన అధికారిక ప్రకటన లేదు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం, రాబోయే రాజకీయ పరిణామాల ఆధారంగానే ఈ ప్రచారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి!

- అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కు పొందాలి: పబ్బు రాజు గౌడ్



తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 29: తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ కోరారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తుతో పాటు డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు లేదా నిబంధనల ప్రకారం అంగీకరించే విద్యార్హత ఆధారాలను సమర్పించాలని తెలిపారు. అర్హత తేదీకి కనీసం మూడేళ్ల ముందు డిగ్రీ అర్హత పొంది ఉండటంతో పాటు, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉండాలనే నిబంధనలను పరిశీలించుకోవాలని సూచించారు.ఓటరు నమోదు చివరి తేదీ, ఇతర వివరాలను సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద తెలుసుకుని అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని పబ్బు రాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రీకారం

- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ హరిప్రసాద్, మార్కెట్ చైర్మన్ హరీష్‌రెడ్డి

తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 29: వరంగల్ జిల్లా నెక్కొండలోని చెరువు బైపాస్ రోడ్డులో దొంగల లావణ్యఅశోక్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచనల మేరకు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, రాచకొండ రఘు, బొమ్మరబోయిన రమేష్ యాదవ్, నేతుల సారంగపాణి యాదవ్, పొట్లపెల్లి వీరస్వామి, బాల్నే ప్రశాంత్ యాదవ్, శ్రీధర్, రావుల నరసింహారెడ్డి, బానోతు చంద్రు, డప్పు వెంకన్న, నెహ్రూ, పంజాల యాకయ్య, బోళ్ల నందయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు

తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 29: వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని ముగ్దుంపురం గ్రామంలో నాగారం గ్రామానికి చెందిన పల్లంకొండ ఉప్పలయ్య మనవడు, మనవరాలి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సీనియర్ నాయకుడు, న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్ తదితరులు చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాటోత్ రమేష్, సీనియర్ నాయకుడు కట్కూరి నరేందర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కారింగుల సురేష్ గౌడ్, అలంఖానిపేట మాజీ సర్పంచ్ మాదాసు రవి, నెక్కొండ మాజీ ఉపసర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో యువకుల రక్తదానం

● ఎస్సై బానోత్ వెంకన్న ఆధ్వర్యంలో తొర్రూరుకు

తరలివెళ్లిన నర్సింహులపేట యువకులు

తొలిఅక్షరం /నర్సింహులపేట అక్టోబర్ 29 : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా తొర్రూరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నర్సింహులపేట మండలానికి చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఎస్సై బానోత్ వెంకన్న ఆధ్వర్యంలో యువకులు శిబిరానికి తరలివెళ్లి రక్తదానం చేసి మానవతా విలువలను చాటుకున్నారు.రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి దాతలు అందించే రక్తం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని, రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువకులను పలువురు అభినందించారు.

శకుంతల అమ్మకు ఘనంగా శ్రద్ధాంజలి



తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 29: వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన ఈనాడు పత్రిక విలేకరి దాసరి శ్రీనివాస్, నాగరాజు శ్యామ్‌ల తల్లి శకుంతల అమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో చంద్రుగొండ క్రాంతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాముల నాగేశ్వర్ పాల్గొని పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దశదిన కర్మ కార్యక్రమంలో పలువురు పాల్గొని నివాళులర్పించారు.

పెద్దవంగర మండల కాంగ్రెస్ నూతన కార్యవర్గం ప్రకటన

● అధ్యక్షుడిగా రంగు

మురళి గౌడ్ నియామకం

పెద్దవంగర, అక్టోబర్ 29 (తొలి అక్షరం): పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దవంగర మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.మండల అధ్యక్షుడిగా రంగు మురళి గౌడ్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసరి శ్రీను, పన్నేరు వేణు, సీతారాం నాయక్; ప్రధాన కార్యదర్శులుగా పాషా ఎం.డి., అన్నపురం శ్రీనివాస్, బండారు వెంకన్న, ముసుకు శోభన్ నియమితులయ్యారు.కార్యదర్శులుగా పాకనాటి రాహుల్‌రెడ్డి, పాక అనిల్, లావణ్య యాదవ్, తేజావత్ జమున, యాకన్న, పెరుగు మహిపాల్‌రెడ్డి, బొమ్మరబోయిన రవి, అశ్విని ముసుకు; కార్యవర్గ సభ్యులుగా ధరావత్ మోతీరామ్, ఎర్ర యాదగిరి, జాటోత్ జలాల్‌పతి, జాటోత్ మోహన్, సంతోష్ యాదవ్, మాడిపెద్ది మల్లమ్మ నియమితులయ్యారు. అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎస్సీ సెల్‌కు చెరుకు సత్యం, బీసీ సెల్‌కు మద్దెల యాకయ్య, మైనారిటీ సెల్‌కు రహీమ్ ఉద్దీన్, కిసాన్ సెల్‌కు గద్దల ఉప్పలయ్య, ఎస్టీ సెల్‌కు జాటోత్ వెంకన్న, మహిళా విభాగానికి చిలుక దేవేంద్ర నియమితులయ్యారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జాటోత్ నెహ్రూ నాయక్, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు, జిల్లా కార్యదర్శి దంతాలపల్లి రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీఎస్ హరికృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

జీఓ 25ను వెంటనే సవరించాలి!

తరగతికి ఒక టీచర్‌ను నియమించాలి

టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ం

జంజిరాల నాగరాజు డిమాండ్

తొలిఅక్షరం/నర్సింహులపేట అక్టోబర్ 29: ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించి, విద్యాబోధనకు ప్రాధాన్యమివ్వాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు జంజిరాల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 25ను తక్షణమే సవరించి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల వ్యవహారశైలితో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.**బోధనకు ఆటంకంగా బోధనేతర పనులు** రోజుకో పథకం.. మరోవైపు నివేదికల పేరుతో ఉపాధ్యాయులను పరుగులు పెట్టిస్తున్నారని నాగరాజు విమర్శించారు. ఈ పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుండటంతో విద్యార్థులకు బోధన కుంటుపడుతోందన్నారు. ఒకరు, ఇద్దరు ఎస్‌జీటీలు మాత్రమే పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని పేర్కొన్నారు. బోధనతోపాటు కంప్యూటర్ వర్క్, జిరాక్స్ తదితర పనులు నిర్వహించాల్సి వస్తుండటంతో ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోందన్నారు.**స్పార్క్ విధానంపై పునఃసమీక్ష అవసరం** జీఓ 25 అమలు విషయంలో విద్యాశాఖ అధికారుల తీరుతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. స్పార్క్ విధానాన్ని మరోసారి సమీక్షించాలని, పాఠశాలలకు అందుతున్న అరకొర నిధుల విషయంలో అధికారుల తీరు మారాలని సూచించారు. పాఠశాలల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి, ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, అరుణ్, పెద్దవంగర మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నర్సింహులపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయక్, బాలలింగం, నెల్లికుదురు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కల్యాణ్, దంతాలపల్లి మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా బాధ్యులు వీరేశం, హరిబాబు, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు విద్యార్థులు

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 29: రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పోలీస్ శాఖ వారు నిర్వహించిన 2 కె రన్ కార్యక్రమంలో పాల్గొన్నారుయాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో రామన్నపేట పట్టణంలో సుభాష్ విగ్రహం నుండి నల్లగొండ రోడ్డు వైపు నిర్వహించబడిన 2కె రన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు రామన్నపేట సిఐ ఎం రవికుమార్ ఎస్సై జి సతీష్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. పోలీస్ శాఖ వారు ఈ కార్యక్రమాన్ని యాంటీ డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్ అవగాహనలో భాగంగా 2కె రన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పున్నారావు,మాలె వెంకట్ రెడ్డి,నరసింహ రావు, అశోక్ కుమార్, నగేష్,రాజేశ్వరి, ఉమారాణి లు పాల్గొన్నారు.

మదర్ థెరిసా హైస్కూల్లో బాలల హక్కులపై న్యాయ అవగాహన సదస్సు

గుడ్ టచ్‌బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించిన జడ్జి ఎస్. శిరీష

తొలి అక్షరం / రామన్నపేట, అక్టోబర్ 29: యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రామన్నపేట మండల కేంద్రంలోని మదర్ థెరిసా హైస్కూల్లో మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో 'సురక్ష బచ్‌పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, పోక్సో చట్టం2012పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష విద్యార్థులకు గుడ్ టచ్‌బ్యాడ్ టచ్, బాలల భద్రతపై అవగాహన కల్పించారు.బాలలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆపదలో ఉన్న పిల్లలు 1098, పోలీసు సహాయం కోసం 112, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించాలని సూచించారు.విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపుతూ, సామాజిక మాధ్యమాలను విజ్ఞానాభివృద్ధికి ఉపయోగించుకోవాలని, ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి పౌరులుగా ఎదగాలని జడ్జి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది కునూరు శ్రీనివాస్, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కె. శ్రీశైలం, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్త కె. యాదయ్య పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జె.ఎస్. మార్టిన్, ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువును ఎదుర్కొనేందుకు జలసంరక్షణపై అవగాహన

తొలి అక్షరం / రామన్నపేట, అక్టోబర్ 29: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రామన్నపేట మండలంలోని నిదానపల్లి, ఇంద్రపాలనగరం, బోగారం గ్రామాల్లో అధికారులు జలసంరక్షణపై అవగాహన కల్పించారు .ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రఫీ, వ్యవసాయ అధికారి ఏజాజ్ ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆశిష్ రాఘవ నీటిని పొదుపు చేయాలని, ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని తెలిపారు. సర్పంచులు, వార్డు సభ్యులు, పథక సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. ఇతర గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

శకుంతల అమ్మకు ప్రెస్ క్లబ్ సభ్యుల నివాళి

తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 29: వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన ఈనాడు విలేకరులు దాసరి శ్రీనివాస్, నాగరాజు శ్యామ్‌ల తల్లి శకుంతల అమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో నెక్కొండ మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని పూలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, వివిధ పత్రికల విలేకరులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉంటా...

- రూ.5 వేల ఆర్థిక సాయం అందించిన దైద రవీందర్

తొలి అక్షరం / రామన్నపేట, అక్టోబర్ 29: నకిరేకల్ నియోజకవర్గం కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు పాల్వాయి గురువయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన దశదినకర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని, గురువయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో జెండా మోసి పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త తమ కుటుంబ సభ్యుడేనని అన్నారు. కార్యకర్తలకు కష్టం వచ్చినప్పుడు వారి కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతని పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజలు, కార్యకర్తలతో ఉండే అనుబంధమే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు లక్కపాక వెంకన్న, పాల్వాయి వెంకటయ్య, పాల్వాయి గామయ్య, మాజీ ఎంపీటీసీ లోకేష్, మెరుగు బిక్షం, లక్కపాక గోవర్ధన్, లక్కపాక వీరస్వామి, సురేష్, సాగర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చలాన్లపై శ్రద్ధ.. ట్రాఫిక్ నియంత్రణపై ఏదీ?

- చౌటుప్పల్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ కష్టాలు.. విద్యార్థుల భద్రతపై ఆందోళన

తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 29: చౌటుప్పల్ ప్రధాన రహదారిపై రోడ్డు పనులతో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా సాయంత్రం పాఠశాలలు ముగిసే సమయంలో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. తంగడపల్లి రోడ్డు వద్ద తనిఖీలు, చలాన్ల విధింపుపై చూపుతున్న శ్రద్ధను ప్రధాన రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణపైనా చూపాలని సూచిస్తున్నారు. రోడ్డు పనులు పూర్తయ్యే వరకు ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులను నియమించి, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనం ప్రతిఒక్కరు విజయవంతం చేయాలి

- నియోజకవర్గ కో- కన్వీనర్ జెల్ల ఉపేందర్

తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 29: వచ్చే నెల 22 న హనుమకొండ లోని కాలోజీ కళాక్షేత్రంలో జరగబోయే స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని స్వేరోలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని స్వేరో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ నియోజకవర్గ కో- కన్వీనర్ జెల్ల ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఆత్మీయ సమ్మేళన గోడపత్రికలను స్వేరో జిల్లా అధ్యక్షులు బాషిపంగు మహేందర్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఇండ్ల వెంకటేశ్వర్లు స్వేరోలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మహానీయుల బాటలో పయనిస్తూ స్వేరో బిడ్డలను ఉన్నత శిఖరాలను అధిరోహించేలా కృషిచేసి వందలాదిమంది జీవితాలను సక్రమ మార్గంలో నడుపుటకు నాంది పలికిన సుప్రీం స్వేరో డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రిటైర్డ్ అడిషనల్ డిజిపి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న సందర్భంగా స్వేరోలు, ఆర్ఎస్పీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరో గుండె రామనర్సయ్య, స్వేరో జిల్లా అధికార ప్రతినిధి సుధీర్, కో కన్వీనర్ గుజ్జునూరి నరేష్, ప్రజాసంఘాల నాయకులు ఇసంపల్లి సైదులు, దండెంపెల్లి సైదులు,గౌతమ్, మహేందర్, కరుణాకర్,హెచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి కోసం సీనియర్ ఐఏఎస్ కలిసిన సర్పంచ్ చైతన్య నాగరాజు

తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 29: నెల్లికుదురు మండలం మునిగిలవీడు గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనుల కోసం గ్రామ సర్పంచ్ చైతన్య నాగరాజు,మడికొండ రాంపూర్ లో సీనియర్ ఐఏఎస్ తెలంగాణ ప్రభుత్వం మాజీ సలహాదారులు బియ్యాల వెంకట పాపారావు, ఐఏఎస్ ని కలిసిన మునిగలవీడు సర్పంచ్ చైతన్య నాగరాజు, బైసనాగరాజ్,నాగవెల్లి బాలరాజు, వారిని కలవడం జరిగింది. అదేవిధంగా బియ్యాల వెంకట పాపారావు ,ఐఏఎస్ వారితో పాటుగా బియ్యాల దయాకర్ రావు, బియ్యాల దేవేందర్ రావు, ఆలుమని అసోసియేషన్ ఆఫ్ జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ అధ్యక్షులు. కోమండ్ల సోమేశ్వరరావు,ని ప్రత్యేకంగా కలవడం జరిగింది. ఊరి యొక్క అభివృద్ధి గురించి వారికి వివరించి సాయ సహకారాలను దించాలని కోరడం జరిగింది.

నెక్కొండలో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

- ఓటు నమోదు చేసుకోవాలని పట్టభద్రులకు బీజేపీ నాయకుల పిలుపు

తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 29: వరంగల్ జిల్లా నెక్కొండలో అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. మండల ఎమ్మెల్సీ కన్వీనర్ అంబాల సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమని పేర్కొన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే బీజేపీ నాయకులు సహకరిస్తారని తెలిపారు. ఓటరు నమోదు వివరాల కోసం నాయిని అశోక్ (9701053729), అంబాల సుధీర్ (9885984120)ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నియోజకవర్గ కో-కన్వీనర్ కట్ల

రామచంద్రారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు నాయిని అనూష, అశోక్, మండల ఇన్‌చార్జి కుడికాల శ్రీధర్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్, పలువురు బీజేపీ నాయకులు, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామగిరి పెద్ద చెరువుకు గండ్లు

- స్వయంగా రంగంలోకి దిగిన గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్

తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 29: నెల్లికుదురు మండలంశ్రీరామగిరి గ్రామంలోని పెద్ద చెరువు మత్తడి వద్ద గండ్లు ఏర్పడి, రంధ్రాల ద్వారా విలువైన నీరు వృథాగా బయటకు పోతుండటంతో గ్రామ ప్రజల్లో ఆందోళన నెలకొంది. చెరువులో నిల్వ ఉన్న నీరు వృథాగా పోకుండా అరికట్టడంతో పాటు, చెరువుకు మరింత నష్టం జరగకుండా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ సమస్యను గ్రామ ఉపసర్పంచ్. వార్డు మెంబెర్స్, గ్రామ పెద్దలు, మరియు రైతుల సహకారంతో సమస్య గుర్తించిన గ్రామ సర్పంచ్ ఈరోజు స్వయంగా రంగంలోకి దిగారు. కేవలం గ్రాపంచాయతి సిబ్బందికి సూచనలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తానే స్వయంగా చెరువులోకి దిగి మరమ్మతుల పనుల్లో పాల్గొన్నారు. మత్తడి వద్ద ఏర్పడిన గండ్లు, రంధ్రాల కారణంగా నీరు బయటకు పోతున్న పరిస్థితిని పరిశీలించి, నీటి

వృథాను అరికట్టేందుకు జెసిబి మిషన్ తో చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా చెరువుల్లో నిల్వ ఉండే నీరు వ్యవసాయ అవసరాలకు, పశువులకు, భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాంటి విలువైన నీరు వృథాగా పోకుండా చూడటంలో సర్పంచ్ మాదరి ప్రశాంత్ స్వయంగా ముందుకు రావడం గ్రామ అభివృద్ధి పట్ల ఆయనకున్న బాధ్యతను తెలియజేస్తుంది. ప్రజా సమస్యే తన సమస్యగా భావించి, క్షేత్రస్థాయిలోకి దిగి పనిచేయడం నిజమైన ప్రజాసేవకు నిదర్శనం. శ్రీరామగిరి పెద్ద చెరువులో నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచ్ చేపట్టిన ఈ ప్రయత్నం అభినందనీయం. చెరువు నీటిని సంరక్షించి, గ్రామ ప్రజలకు మేలు జరిగేలా ఇలాంటి చర్యలు కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. మాటలకే పరిమితం కాకుండా, ప్రజల సమస్య పరిష్కారం కోసం స్వయంగా రంగంలోకి దిగిన శ్రీరామగిరి గ్రామ సర్పంచ్‌కు అభినందనలు.”ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ రామగిరి సుమన్, మాజీ ఉపసర్పంచ్ గంజి గోవర్ధన్, గ్రామ పెద్దలు &రైతులు డోనికాని మల్లయ్య, గుర్రాల నరేష్, దేశాబోయిన వెంకన్న, పోతా రాజు యాదగిరి, రామగిరి సంతోష్, మెర్గు వీరన్న, నిలరాపు వెంకన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామన్నపేటలో 2 కే రన్ నిర్వహణ

జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్

పోలీసులు, విద్యార్థులు, యువత ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి

జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

తొలి అక్షరం / రామన్నపేట, అక్టోబర్ 29: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రామన్నపేటలో 2ఖ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ హాజరై, రన్‌లో ముందుండి పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువతకు ఉత్సాహాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక

ఉల్లాసాన్ని పొందవచ్చని సూచించారు. పోలీసు విధుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఫిట్‌గా ఉండేందుకు నిత్యం వ్యాయామం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, పోలీసు శాఖకు మరియు ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి ఎక్సైజ్ సీఐ ఏడుకొండల్,రామన్నపేట సీఐ ఎం. రవి, రామన్నపేట ఎస్ఐ జి. సతీష్, వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఆత్మకూరు (ఎం) ఎస్ఐ లక్ష్మీనారాయణ, మోత్కూరు ఎస్ఐ సతీష్, అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఏఎస్ఐ సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు కమలాకర్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది లింగస్వామి, స్వామి నాయక్, ప్రవీణ్, ప్రశాంత్, స్వామి, మధు, కృష్ణమూర్తి, నరసింహ, లావణ్య, కవిత, సైదులు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు. 2ని రన్‌ను విజయవంతం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

• అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కు పొందాలి • కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి

తొలి అక్షరం/నర్సింహులపేట అక్టోబర్ 29: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నర్సింహులపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. **మూడేళ్ల అర్హత తప్పనిసరి** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే భారతదేశంలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, సంబంధిత అర్హత తేదీ నాటికి కనీసం మూడేళ్ల క్రితమే పట్టభద్రుడై ఉండాలని తెలిపారు. సంబంధిత గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉండటంతో పాటు, నిబంధనల ప్రకారం ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. **అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు** ఓటరు నమోదుకు డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రం లేదా ఎన్నికల నిబంధనల ప్రకారం ఆమోదయోగ్యమైన విద్యార్హత ధ్రువపత్రాలను సమర్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి సూచించారు. డిగ్రీ పూర్తిచేసిన తేదీ, మూడేళ్ల అర్హత నిబంధనలను ముందుగా పరిశీలించుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ, చివరి తేదీ తదితర వివరాలను సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద తెలుసుకొని, అర్హులైన పట్టభద్రులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

"సురక్షిత్ బచ్పన్ అభియాన్" ప్రత్యేక అవగాహన కార్యక్రమం

ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుకూరి పూజ

తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: బాలల హక్కుల పరిరక్షణ,బాలలపై లైంగిక నేరాల నివారణ,మానవ అక్రమ రవాణా అరికట్టడం,బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో "సురక్షిత్ బచ్పన్ అభియాన్" ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం మరియు తెలంగాణ ప్రభుత్వ మోడల్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బాలల భద్రత,హక్కులు,చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ "బాలల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు,బాలలపై జరిగే నేరాల నివారణలో సమాజం బాధ్యత గురించి వివరించారు.ప్రతి చిన్నారికి సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించే హక్కు ఉందని,బాలలపై జరిగే నేరాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,పోలీసులు,సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.రామారావు "విద్యార్థులకు బాలల భద్రత,నేరాల నివారణ,పోలీసుల పాత్ర గురించి వివరించారు.అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ మానవ అక్రమ రవాణా నివారణ,బాలలను అక్రమ రవాణా నుంచి రక్షించాల్సిన అవసరాన్ని వివరించారు.ఉద్యోగాలు,ఇతర ప్రలోభాల పేరుతో మోసాలకు గురయ్యే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బాలల అక్రమ రవాణాకు సంబంధించిన అనుమానాలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ ఆర్.రజిని విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం ప్రాముఖ్యతను వివరించారు.బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం,2012,బాల్యవివాహాల నిరోధక చట్టం,బాలల హక్కులకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తగిన సహాయం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హిమబిందు,ప్రిన్సిపాల్ సునీత,పారా లీగల్ వాలంటీర్ శెట్టి.రవళిక,పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

శకుంతల అమ్మకు సొసైటీ ప్రతినిధుల నివాళి

తొలి అక్షరం / నెక్కొండ అక్టోబర్ 29:వరంగల్ జిల్లా నెక్కొండ మండల ఈనాడు విలేకరులు దాసరి శ్రీనివాస్, నాగరాజు శ్యామ్‌ల తల్లి దాసరి శకుంతల అమ్మ దశదిన కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లి రామచంద్రరెడ్డి, కొమ్మారెడ్డి లక్ష్మారెడ్డి, వజ్రాల వెంకట్ రెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, దుగ్గి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అర్కా ఫిల్టర్ కాఫీ షాపు ప్రారంభం

తొలి అక్షరం / నెక్కొండ , అక్టోబర్ 29:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకుడు కెక్కర్ల అనిల్ కుమార్ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన అర్కా ఫిల్టర్ కాఫీ షాపును బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, వ్యాపార రంగంలో ఎదగడానికి తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కాఫీ షాపు నిర్వాహకుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నియోజకవర్గ కో-కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నాయిని అశోక్, మండల ఇన్‌చార్జి కుడికాల శ్రీధర్, మాజీ కౌన్సిలర్ జున్రు రాజు యాదవ్‌తో పాటు పలువురు బీజేపీ, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

బోనం ఎత్తుకొని నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

17వ రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మె

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: వరంగల్ జిల్లా నగరంలోని పోచం మైదాన్ సర్కిల్ లో గురువారం నాటికీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె 17 వ రోజు కు చేరుకుంది.ఈ సందర్భంగా ఉద్యోగులు బోనం ఎత్తుకొని నిరసన తెలుపుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ తెలంగాణ రాష్ట్రంలో 78 క్యాడర్లో సుమారు 17,541 మంది పనిచేస్తున్నారని వీరందరికీ కూడా తక్షణమే రెగ్యులరైజేషన్ తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యంగా ఉద్యోగ భద్రత కల్పించాలని,ఆరోగ్య భద్రత,ఇన్సూరెన్స్,మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు,100% గ్రాస్ శాలరీ,సమాన పనికి సమాన వేతనం,లోయాల్టీ బోనస్,తదితర 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి భరత్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ నిరసనల్లో భాగంగా పోచమ్మ తల్లి సమస్యలతో కూడిన డిమాండ్లు పరిష్కరించాలని తల్లి దగ్గర డిమాండ్ పత్రాలు పెట్టడం జరిగింది.ఉద్యోగులు

ఆకర్షించడానికి మరియు తమ ఆవేదనను తెలపడానికి బోనాలు ఎత్తుకొని ప్రత్యేకంగా నిరసన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా,ఆర్ బి ఎస్ కే రాష్ట్ర ఆర్గనైజర్ డాక్టర్ గుండా రవీందర్ డాక్టర్ హరికృష్ణ,డాక్టర్ రామ్ రాజు,డాక్టర్ యశస్విని,డాక్టర్ అనిత,డాక్టర్ మధు,డాక్టర్ సునీత దేవి,డాక్టర్ నిఖిల్,డాక్టర్.హారిక,ఈవిన్ మేనేజర్ రవీందర్,డైకు మేనేజర్ మేర్గు అనిల్ కుమార్,నర్సింగ్ ఆఫీసర్స్ స్వప్న సుమలత,కళ్యాణి,సుమలత, సుష్మ,ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్ ,సంతోష్,శివకుమార్,తీగల సతీష్ కుమార్,పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెల్,వైకుంఠం,టీబీ డిపార్ట్మెంట్ రంజిత్,రాకేష్,అకౌంటెంట్స్ ఆచంట అభిషేక్,శ్వేత,శ్రీనివాస్ బాబు,ప్రేమలత,మౌనిక ఏ.ఎన్.ఎం.లు దాసరి నర్మదా,సంధ్య,జ్యోతి,సుల్తానా, పేనీన,ఉప్పలమ్మ,నర్మద,రాజేశ్వరి,ప్రభావతి,అనిత,శ్రీలత,ల్యాబ్ టెక్నీషియన్లు జూకంటి మౌనిక,ఎం.ఎన్.ఓ. ఏకుల చిరంజీవి,బండి రాజేష్,అజ్మీర విజయ నాయక్,కలవల్ల కుమార్,సపోర్టింగ్ స్టాఫ్ గూడెపు ప్రభాకర్,రజియా తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో పుస్తక ఆవిష్కరణ

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కేడల కరుణశ్రీ రచించిన ఇంజినీరింగ్ కమ్యూనికేషన్ అండ్ లాంగ్వేజ్ స్కిల్స్ పుస్తకాన్ని కళాశాలల చైర్మన్ డా. సిహెచ్. దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు, సంభాషణా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరుణశ్రీ తండ్రి కేడల జనార్ధన్, తల్లి కేడల పద్మ, భర్త శంకేసి రాజేష్ పాల్గొన్నారు. ఈ పుస్తకం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది.

ఆత్మహత్యగా చిత్రించే యత్నం.. పోస్టుమార్టంతో వెలుగులోకి బాలిక హత్య

కుమార్తె మృతి కేసులో తల్లి అరెస్ట్

తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 29:రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలిక సువర్ణ అలియాస్ లప్పీ మృతి కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాలిక తల్లి ముయ్యాది విజయలక్ష్మి (34)ను హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను షాద్‌నగర్ జోన్ డీసీపీ సి. శిరీష రాఘవేంద్ర వెల్లడించారు.కొత్తూరులోని హనుమాన్ టెంపుల్ కాలనీకి చెందిన లప్పీ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 27న ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అయితే, ఉస్మానియా ఆసుపత్రిలో నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో గొంతు నులిమివేయడం వల్ల మరణించినట్లు సూచనలు రావడంతో పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు.పోలీసుల కథనం ప్రకారం, మొబైల్ ఫోన్ వినియోగం విషయంలో తల్లీకూతుళ్ల మధ్య తరచూ గొడవలు జరిగేవి. అక్టోబర్ 27న జరిగిన వాగ్వాదం సందర్భంగా విజయలక్ష్మి బాలిక గొంతు నులిమి, అనంతరం ఘటనను ఆత్మహత్యగా చిత్రించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు ఆరోపించారు.వైద్య నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా నిందితురాలిని విచారించి అక్టోబర్ 29న అరెస్ట్ చేశారు. ఆమెను

న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. డీసీపీ సి. శిరీష రాఘవేంద్ర, ఏసీపీ పి. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కొత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

ఎన్ఐటీ వరంగల్‌లో టెక్నోజియన్ '26 సాంకేతిక ఉత్సవం

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఎన్ఐటీ వరంగల్‌లో అక్టోబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు వార్షిక సాంకేతిక ఉత్సవం టెక్నోజియన్ '26 నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో 50కి పైగా కార్యక్రమాలు, రోబోటిక్స్ పోటీలు, స్టార్టప్ ఛాలెంజ్, సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించనున్నారు.ప్రారంభోత్సవానికి ఓలెక్ట్రా వైస్ ప్రెసిడెంట్ కమల్ కిషోర్ వోరా ముఖ్య అతిథిగా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, సాంకేతిక నిపుణులు పాల్గొనే ఈ ఉత్సవం ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ నైపుణ్యాల అభివృద్ధికి వేదికగా నిలవనుంది. 2006లో ప్రారంభమైన టెక్నోజియన్‌ను విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం

● కొందుర్గ్ పీఎస్‌లో డీసీపీ శిరీష రాఘవేంద్ర తనిఖీలు

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: షాద్‌నగర్ జోన్ పరిధిలోని కొందుర్గ్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ శిరీష రాఘవేంద్ర గురువారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, భద్రతా ఏర్పాట్లు మరియు సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొందుర్గ్ ప్రాంతాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అక్రమ రవాణా మరియు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ మోసాలు మరియు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేరాల నివారణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని, అలాగే సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లోని 17 విభాగాల సిబ్బంది విధులపై సమీక్ష నిర్వహిస్తూ, పోలీసులు ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ వృత్తిపరమైన క్రమశిక్షణ పాటించాలని హెచ్చరించారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ మరియు మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కొందుర్గ్ ఎస్‌హెచ్‌ఓ వరప్రసాద్, ఏఎస్ఐ ఛత్రియా, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, డీసీపీ కార్యాలయ రైటర్ రాజేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల భద్రతే లక్ష్యం.. వెల్‌జర్లలో వీసీపీసీ కమిటీ ఏర్పాటు

● బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణపై అవగాహన

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: వెల్ జర్ల గ్రామంలో బాలల భద్రత, హక్కుల పరిరక్షణకు కీలక అడుగు పడింది. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ (వీసీపీసీ)ను ఏర్పాటు చేశారు. పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, వారిపై జరిగే హింస, వేధింపులను అరికట్టడం, బాల్య వివాహాల నివారణ లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబు నాయక్, జీపీఓ, ఐసీడీఎస్ సూపర్వైజర్ జాహ్నవి, ఐసీపీఎస్ సిబ్బంది శ్రీలత, అశ్విత ఎన్జీఓ సిబ్బంది గీత, అంగన్‌వాడీ టీచర్, తల్లులు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు బాలల హక్కులు, పిల్లల పరిరక్షణ బాధ్యతలు, బాలలపై జరిగే హింస, వేధింపులను గుర్తించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలు ఎదుర్కొనే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. **సమాజ భాగస్వామ్యంతోనే బాలల రక్షణ** బాలల హక్కులను కాపాడటం ఒక్క శాఖకే పరిమితమైన బాధ్యత కాదని, తల్లిదండ్రులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రతి చిన్నారికి రక్షణ, గౌరవం, భద్రత కల్పించేందుకు వీసీపీసీ కమిటీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బాలలపై ఎలాంటి హింస, వేధింపులు జరిగినా స్పందించి, బాల్య వివాహాల వంటి సామాజిక సమస్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల ఆందోళనతో దిగొచ్చిన యంత్రాంగం

● కాలుష్యంపై నివేదికకు ఆర్డీవో సరిత ఆదేశం

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: పరిశ్రమల కాలుష్యంపై గ్రామస్థుల నిరసన ఉద్ధృతం కావడంతో అధికారులు స్పందించారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద పంచాయతీ పరిధిలోని కందివనం గ్రామ సమీపంలో ఉన్న శివశక్తి, కేడియా స్పాంజ్ ఐరన్ పరిశ్రమల కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని షాద్‌నగర్ ఆర్డీవో ఎన్.ఆర్. సరిత ఆదేశించారు. కాలుష్య సమస్యపై సమగ్ర పరిశీలన చేసి నివేదిక అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, బూడిదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ కందివనం గ్రామస్థులు బుధవారం ప్రారంభించిన ఆందోళన గురువారం కూడా కొనసాగించారు. రెండో రోజు పాఠశాల విద్యార్థులు సైతం నిరసనలో పాల్గొనడంతో సమస్య మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళలు, వృద్ధులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పరిశ్రమల ఎదుట బైఠాయించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల కాలుష్యం కారణంగా దగ్గు, ఆయాసం, శ్వాసకోశ ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంట పొలాలపై బూడిద పేరుకుపోవడం, చెరువుల్లో వ్యర్థాలు చేరడం వల్ల వ్యవసాయానికి, పశువులకు, జలచరాలకు నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందివనంతో పాటు చౌలపల్లి, గుండెగాని తండా, పిట్టలగడ్డ తండా ప్రజలు కూడా ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు సైతం ఆందోళనకు దిగడంతో షాద్‌నగర్ ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, స్థానిక తహసీల్దార్ నాగయ్యతో కలిసి పరిశ్రమల పరిసరాలను సందర్శించారు. నిరసన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిస్థితులను పరిశీలించిన అనంతరం పరిశ్రమల కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమగ్రంగా పరిశీలించి నివేదిక అందించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అధికారుల జోక్యంతో గ్రామస్థులు కొంత ఊరట చెందినప్పటికీ, కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలన్న డిమాండ్ కొనసాగుతోంది. పరిశ్రమల కార్యకలాపాలపై కాలుష్య నియంత్రణ మండలి నివేదికలో ఏమి తేలనుంది? నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు నిర్ధారణ అయితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు దీపావళి కానుకలు

● ఆసుపత్రి కార్మికులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దుస్తుల పంపిణీ

● పండుగ వేళ కార్మికులకు అండగా దాత కేకే కృష్ణ

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: దీపావళి పండుగను పురస్కరించుకొని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ దుస్తులను పంపిణీ చేశారు. దాత కేకే కృష్ణ అందించిన దుస్తులను ఆసుపత్రి కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పండుగ వేళ కార్మికులకు కానుకలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో పాటు కార్మికుల సేవలు కూడా ఎంతో విలువైనవని పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు సేవలందించే కార్మికులను పండుగ సందర్భంగా గుర్తించి దుస్తులు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ సి. పెంటయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు అరుంధతి రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, బాలరాజు గౌడ్, దామోదర్ రెడ్డి, గుట్ట రాజు, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6.5 కోట్లతో గ్రామీణ రహదారి నిర్మాణం

- నాగులపల్లి రోడ్డుకు ఎమ్మెల్యే శంకర్ శ్రీకారం

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: షాద్‌నగర్ నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం ఫరూఖ్‌నగర్ ఎస్సీ కాలనీ నుంచి నాగులపల్లి మీదుగా మొదళ్లగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. తొలి విడతలో రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో ఫరూఖ్‌నగర్ ఎస్సీ కాలనీ నుంచి నాగులపల్లి వరకు పనులు చేపట్టనున్నారు. రెండో విడతలో రూ. 4 కోట్లకు పైగా నిధులతో నాగులపల్లి నుంచి మొదళ్లగూడ వరకు రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు మొత్తం రూ. 6.5 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు. ఈ మార్గం గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతులు, విద్యార్థులు, స్థానికులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రాధిక, ఉపసర్పంచ్ కిరణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20వ వార్డులో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

● పోడుచెట్టు గల్లీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ శుభ్రం

● డ్రైనేజీ వ్యర్థాలను తొలగించిన కౌన్సిలర్ గోపాల్

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పోడుచెట్టు గల్లీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ జామ్ కావడంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. స్పందించిన వార్డు కౌన్సిలర్ పినమోని గోపాల్ మున్సిపల్ సిబ్బంది సహకారంతో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. మురుగునీరు సాఫీగా ప్రవహించేందుకు చర్యలు చేపట్టారు. డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో సమస్యను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పారిశుధ్య సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు చేపడతామని కౌన్సిలర్ తెలిపారు. వార్డులోని సమస్యలను గుర్తించి మున్సిపల్ అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. డ్రైనేజీ సమస్యపై స్పందించి వ్యర్థాలను తొలగించడంతో స్థానికులు ఊరట చెందారు.

త్వరలో షాద్‌నగర్‌లో 100 పడకల ఆసుపత్రి

● వైద్య సేవల విస్తరణకు ప్రత్యేక చర్యలు

● ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే శంకర్

తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 29: షాద్‌నగర్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు త్వరలో 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొన్న ఆయన ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సభ్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మోత్కూల గూడలో బీరప్ప స్వామి ఆలయ స్లాబ్ పనులు ప్రారంభం

- కొబ్బరికాయ కొట్టి బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 29: నందిగామ మండలం మోత్కూల గూడ గ్రామంలోని శ్రీ బీరప్ప స్వామి దేవాలయానికి స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుల పెద్దలు, కురువ సంఘం పెద్దలు, సంఘం సభ్యులు కలిసి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. స్వామివారి ఆశీస్సులతో ఆలయ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని ఆకాంక్షించారు. గ్రామంలో బీరప్ప స్వామి దేవాలయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు కోరారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఆలయ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, కురువ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం సంఘ సభ్యులు ఐక్యంగా ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ బీరప్ప స్వామి వారి కృప గ్రామ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు.

ప్రజలకు పోలీసు సేవలను చేరవేయడమే సురక్ష లక్ష్యం

-సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ

-పోలీసు వ్యవస్థలోని త్యాగాలు, సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి -డిజిపి సి.వి. ఆనంద్

-స్థానిక భాషపై పట్టు ఉంటేనే ప్రజలతో మెరుగైన అనుసంధానం

-ప్రాంతీయ యాసలు, భాషా వైవిధ్యమే ప్రత్యేకత

-సురక్ష దిన పత్రిక ప్రథమ వార్షికోత్సవంలో డిజిపి సి.వి.ఆనంద్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబరు29: మారుతున్న సమాచార వ్యవస్థలో పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలంగాణ డిజిపి, 'సురక్ష' దినపత్రిక ప్రధాన సంపాదకుడు సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. పోలీసులపై తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పుడు వాస్తవాలను ప్రజలకు వివరించడంతోపాటు, ప్రజా సమస్యలు, పోలీసు సేవలు, నేరాలపై అవగాహన కల్పించడంలో సురక్ష కీలక పాత్ర పోషించాలని సూచించారు.తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్ష దినపత్రిక ప్రథమ వార్షికోత్సవ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని పేట్లబురుజులో ఉన్న సిటీ పోలీస్ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ సి.వి. ఆనంద్ ప్రధాన సంపాదకుడి హోదాలో హాజరయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్, సురక్ష కార్యనిర్వాహక సంపాదకుడు రమేష్ ఆయనకు స్వాగతం పలికారు. ప్రముఖ పాత్రికేయుడు పమిడికాల్వ మధుసూదన్, మామిడి హరికృష్ణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, పోలీసు యూనిట్లకు చెందిన పీఆర్వోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. **సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ:** ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సమాచార ప్రసార విధానంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. గతంలో ఉర్దూ, ఆంగ్లం, తెలుగు పత్రికల ద్వారా ప్రజలకు వార్తలు చేరేవని, అనంతరం టీవీల ద్వారా పరిమిత సమయంలో వార్తలు ప్రసారమయ్యేవని గుర్తుచేశారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రత్యక్ష ప్రసారాలు, సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాయని చెప్పారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో సమాచారం క్షణాల్లో ప్రజలకు చేరుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను తక్షణమే తెలుసుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. అయితే, సమాచారం వేగంగా వ్యాపిస్తున్న క్రమంలో అందులోని నిజానిజాలను నిర్ధారించడం సవాలుగా మారుతోందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత కారణాలతో పోలీసులపై తప్పుడు కథనాలు ప్రచురించడం, వాస్తవాలను వక్రీకరించడం జరుగుతోందన్నారు. **పోలీసుల సేవలు ప్రజలకు చేరాలి:** పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొనే సవాళ్లు, సమాజం కోసం చేసే త్యాగాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని డిజిపి స్పష్టం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు పోలీసుల సామాజిక బాధ్యతకు నిదర్శనమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు, ప్రత్యేక కథనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.పోలీసు వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, పెట్రోలింగ్ విధానాలు, కిడ్నాప్ కేసులు, వివిధ నేరాలకు సంబంధించిన వివరాలు, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలను సురక్ష లో ప్రచురించాలని అన్నారు. కేసుల దర్యాప్తులో ఎదురయ్యే సవాళ్లు, తప్పిదాల

నివారణ, సిబ్బంది మంచి పనులు, వివిధ నేరాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా ప్రత్యేక కథనాలు, వ్యాసాలు రూపొందించాలని తెలిపారు. **స్థానిక భాషపై పట్టు అవసరం:** ప్రజలతో మాట్లాడేటప్పుడు స్థానిక భాషపై అవగాహన, పట్టు అధికారులకు ఎంతో అవసరమని డిజిపి అన్నారు. తెలుగు భాష ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. బ్రిటిష్ పాలనలో స్థానిక భాషల అధ్యయనానికి ప్రాధాన్యం ఇచ్చిన విధానాలను ప్రస్తావించారు. స్థానిక భాష తెలిసినప్పుడే ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు, వారి ఆలోచనా విధానం, సామాజిక పరిస్థితులను అధికారులు అర్థం చేసుకోగలుగుతారని చెప్పారు.తెలుగు భాషకు విశేష సేవలందించిన సి.పి. బ్రౌన్ కడప ప్రాంతంలో పనిచేసిన సమయంలో తెలుగు సాహిత్య గ్రంథాల సేకరణ, ప్రచురణకు కృషి చేశారని గుర్తుచేశారు. ఇక్కడి విషయాలు, విశేషాలను ఇంగ్లీష్, జర్మన్ వంటి ఇతర భాషల్లోకి అనువదించడం ద్వారా

భాషా సంపదను విస్తృతంగా పరిచయం చేసే అవకాశం కలిగిందన్నారు.తాను హైదరాబాద్‌లో జన్మించినందున ఇక్కడి ప్రాంతీయ భాషలు, యాసలు, సంస్కృతిపై తనకు ప్రత్యేక అవగాహన ఉందని డీజీపీ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రాంతాలవారీగా భాషలో కనిపించే వైవిధ్యం, యాసలోని ప్రత్యేకత భాషకు మరింత అందాన్ని తెస్తాయని చెప్పారు. పోలీసు అధికారులు ప్రజలతో నేరుగా మాట్లాడే సమయంలో స్థానిక భాషపై పట్టు సాధిస్తే వారి సమస్యలను సులభంగా అర్థం చేసుకుని, మెరుగైన సేవలు అందించగలరని స్పష్టం చేశారు **ప్రజలకు పోలీసు సేవలపై అవగాహన కల్పించాలి:** పోలీసు శాఖ లో చేపడుతున్న సంస్కరణలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలు, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలను నిరంతరం ప్రజలకు తెలియజేయడమే సురక్ష ప్రధాన లక్ష్యంగా ఉండాలని డీజీపీ సూచించారు. వార్తల ప్రచురణలో వాస్తవికత, స్పష్టత, ప్రజోపయోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య సమాచార వారధిగా సురక్ష నిలవాలని ఆకాంక్షించారు.

అమరుల స్మరణలో..రక్తదాన మహోద్యమం

- నగర కమిషనరేట్ పరిధిలోని 38 కేంద్రాల్లో మెగా శిబిరాలు

- సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్29: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల మహోన్నత త్యాగాలకు నివాళిగా హైదరాబాద్ సిటీ పోలీస్ గురువారం మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసింది. రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు, తలసేమియా చిన్నారులు, క్యాన్సర్ రోగుల అత్యవసర చికిత్సలకు అండగా నిలిచేందుకు నగరవ్యాప్తంగా 38 కేంద్రాల్లో ఈ బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టింది. సుమారు 30 బ్లడ్ బ్యాంకుల సహకారంతో దాదాపు 5,700 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ఈ శిబిరాలను కొనసాగిస్తోంది.ఇందులో భాగంగా పేట్లబురుజులోని సీఏఆర్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన కేంద్రాన్ని రాష్ట్ర డీజీపీ శ్రీ సీవీ ఆనంద్, ఐపీఎస్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు నగర పౌరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ శ్రీ సీవీ ఆనంద్, ఐపీఎస్ మాట్లాడుతూ.. అక్టోబరు 21 నుంచి 31 వరకు అమరవీరుల స్మరణార్థం రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సమాజ రక్షణ కోసం పండుగలు, సెలవులను సైతం

విడిచిపెట్టి పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం త్యాగనిరతి చాటుకుంటున్నారని కొనియాడారు. ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని ఉద్యమంలా చేపట్టి, సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధితులకు, ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం సంజీవనిలా ఉపయోగపడుతుందన్నారు. ఇదే సమయంలో రక్తదానం, అవయవదానంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ప్రైవేటు ఆసుపత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. అమరుల త్యాగాలను స్మరిస్తూ వారికి నిజమైన నివాళి అర్పించాలనే సంకల్పంతోనే కమిషనరేట్ పరిధిలో పెద్దఎత్తున ఈ శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ మహత్కార్యానికి సహకరించిన ఉస్మానియా, గాంధీ, నిమ్స్, కింగ్ కోఠి, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్స్, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులకు, అలాగే రెడ్ క్రాస్, తలసేమియా ఫౌండేషన్, రోటరీ, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలకు, రక్తదాతలకు

కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ (క్రైమ్) ఎం. శ్రీనివాసులు ఐపీఎస్ ,అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్, , జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ ఐపీఎస్, డీసీపీ (సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్) ఆర్. వెంకటేశ్వర్లు ఐపీఎస్, శ్రీ.రాహుల్ హెడ్గే ఐపిఎస్ డిసిపి ట్రాఫిక్, విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ లతో పాటు అన్ని జోన్ల డీసీపీలు, ఇతర అధికారులు, బ్లడ్ బ్యాంకులకు చెందిన వైద్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జనావాసాల్లో టపాసుల అక్రమ నిల్వ.. ఇద్దరి అరెస్ట్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), అక్టోబర్ 29: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాచవాని సింగారంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 100 కిలోల టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. జయశంకర్ విగ్రహం సమీపంలోని నివాస ప్రాంతంలో 58 పెట్టెల్లో భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణసంచా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

శ్రీచైతన్య హాస్టల్‌లో విద్యార్థుల ఘర్షణ.. కేసు నమోదు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), అక్టోబర్ 29: బోడుప్పల్‌లోని శ్రీచైతన్య కళాశాల హాస్టల్‌లో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు సీఐ డి. జలంధర్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కేసు నంబర్ 1521/26గా నమోదు చేశారు.

మహిళల భద్రత మనందరి బాధ్యత

- ఉస్మానియాలో స్టాండ్‌విత్‌హర్ శిక్షణా కార్యక్రమం ప్రారంభం

- చైతన్యమే రక్షణ కవచం: డీజీ చారు సిన్హా ఐపీఎస్

- వీసీ ప్రొ. కుమార్ మొలుగారం చేతుల మీదుగా లాంఛనప్రారంభం

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్29: సమాజంలో మార్పు కేవలం చట్టాలతోనే సాధ్యం కాదని, ప్రతి ఒక్కరి ఆలోచనా విధానంలో మార్పు రావాలని సీఐడీ, ఏసీబీ, మహిళా భద్రతా విభాగం డీజీ చారు సిన్హా, ఐపీఎస్ అన్నారు. మహిళల రక్షణ, సమానత్వం, సమ్మతి పరస్పర గౌరవాన్ని పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రసిద్ధ స్టాండ్ విత్ హర్ క్యాంపెయిన్‌లో భాగంగా... ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెండు రోజుల ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది.

అక్టోబర్ 30 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. డా. కుమార్ మొలుగారం, డీజీ చారు సిన్హా, ఐపీఎస్, డబ్ల్యూఎస్‌డబ్ల్యూ ట్రైనింగ్ , కంటెంట్ డెవలప్‌మెంట్ హెడ్ అస్సియా షెర్వానీ ఈ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వీసీ ప్రొ. కుమార్ మొలుగారం మాట్లాడుతూ..విద్యాసంస్థలు సురక్షితమైన, అందరికీ సమాన అవకాశాలున్న వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర

పోషిస్తున్నాయని తెలిపారు. ఉస్మానియాలో దాదాపు 40శాతం మంది మహిళా అధ్యాపకులు ఉన్నారని, అలాగే 1,500 మంది మహిళల వసతి కోసం ప్రత్యేకంగా అత్యాధునిక హై-రైజ్ హాస్టల్ వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. **చైతన్యంతోనే అసలైన రక్షణ: డీజీ చారు సిన్హా** పోలీసుల నిఘా ఒక్కటే సరిపోదని, మహిళలపై వేధింపులు, వివక్షతను రూపుమాపేందుకు యువతముఖ్యంగా పురుషులుముందుకు రావాలని చారు సిన్హా పిలుపునిచ్చారు. హానికరమైన మూస పద్ధతులను ఎదిరించి, తప్పును ప్రశ్నించే అప్‌స్టాండర్స్ గా మారాలని పిలుపునిచ్చారు. లింగ సమానత్వం, వ్యక్తిగత హద్దులు, పవర్ డైనమిక్స్‌పై యువతలో స్పష్టత రావాలని ఆకాంక్షించారు.జీవిత నైపుణ్యాల శిక్షణ: కేవలం అవగాహనతో ఆగిపోకుండా... క్రిటికల్ థింకింగ్, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, యాక్టివ్ లిజనింగ్ వంటి కీలక నైపుణ్యాలను ఈ శిక్షణ ద్వారా అందిస్తున్నారు.భారీ లక్ష్యంతో మల్టిప్లైయర్ ఎఫెక్ట్: తొలి విడతగా రెండు రోజుల్లో 4 బ్యాచ్‌లలో 250 మందికి పైగా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నారు. వీరంతా తమ కాలేజీల్లో మరో 2,000 మందికి పైగా అవగాహన కల్పించేలా మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరిస్తారు.మహిళల భద్రత – ఉమ్మడి బాధ్యత: గౌరవం, సమ్మతి, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణమే ధ్యేయంగా స్టాండ్‌విత్‌హర్ ఉద్యమం ముందుకు సాగుతోంది.మహిళల భద్రత అనేది ఎవరికో ఒకరికి సంబంధించిన బాధ్యత కాదు.. మనందరి ఉమ్మడి బాధ్యత. గౌరవం, సమ్మతి, నైతికతతో కూడిన సరికొత్త సమాజం కోసం ప్రతి ఒక్కరూ గొంతెత్తుదాం.

Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad